
నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 52
నూరేళ్ళ తెలుగు కథకు



# బాధపడతాను! ఏడుపురాదు! ఎందుకంటే...

**- పి.ఎస్.నారాయణ**


53 ఏళ్ళగా కథలు రాస్తున్నారాయన. మధ్య తరగతి జీవుల మనఃక్లేశాలను ఎప్పటికప్పుడు ప్రతిభావంతంగా చిత్రించారు. చిత్రిస్తున్నారు. 260కి పైగా కథలు, 31 నవలలు రాశారు. ఇంత విస్తృతంగా రాయడం వెనక కారణం తాను ఇప్పటికీ నిత్య విద్యార్థిలా సమాజాన్ని అధ్యయనం చేయడమే అంటారాయన. ఇటీవలే 'స్వప్నం రాల్చిన అమృతం', 'రేపటికి సూర్యోయం', 'నిన్నటికి వీడ్కోలు' కథల సంపుటాలు వెలువరించిన పి.ఎస్.నారాయణగారితో ఇంటర్వ్యూ ఈ వారం..

## నాలుగేళ్ళ వయసులో నాన్నగారు పోయారు

మాది గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలోని చినకాకాని గ్రామం. మా తల్లిదండ్రులు పొత్తూరి వరలక్ష్మమ్మ, పొత్తూరి రామయ్య గారు. నేను 71 సంవత్సరాల క్రితం జన్మించాను. నా నాలుగేళ్ళ వయసులో మా నాన్న పోయారు. పదమూడేళ్ళ వయసులో మా అమ్మ కూడా చనిపోయింది. మా అక్కయ్య యేటూరి లక్ష్మీరంగమ్మ, బావ యేటూరి అప్పారావు గారు నన్ను పెంచి పెద్ద చేశారు. వారి అమ్మాయి మాధురిని ఇచ్చి పెళ్ళి చేశారు. మాకు ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. నేను సీనియర్ ఎకౌంట్స్ ఎగ్జిక్యూటివ్‌గా వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాను.

## చిన్నప్పుడు బొమ్మలు గీసేవాణ్ణి

నా బాల్యంలో చెప్పుకోదగ్గ గొప్ప పనులేవీ నేను చేయలేదు. నేనెప్పుడూ ముప్ఫయ్ అయిదు మార్కుల స్టూడెంట్‌నే! ఐదో తరగతి చదివే రోజుల్లో బొమ్మలు గీస్తుండేవాణ్ణి. మాది పల్లెటూరు. ఆ రోజుల్లో డప్పు కొట్టుకుంటూ పక్కనున్న టౌన్ నుంచి టూరింగ్ టాకీస్ వాళ్ళ మనుష్యులు వచ్చి వాల్ పోస్టర్లు అంటించి వెళ్ళేవారు. వాళ్ళు అటు వెళ్ళగానే మా ఇంటి గోడకు అంటించిన ఆ పోస్టర్ చించి లోపల ఇంట్లో గోడకు అంటించే వాణ్ణి. అప్పటి వాల్‌పోస్టర్‌లో ఇప్పటిలా ఫొటోలు ఉండేవి కాదు. అందులో నటుల బొమ్మలు చేత్తో గీసినవే! ఆ బొమ్మలు చూస్తూ యథాతథంగా కాగితం మీద గీసేవాడిని. తరువాత తరువాత బొమ్మలు గీయడం ఆపేశాను.




## ఆ ఉత్తరంతో ఉప్పొంగి పోయాను

పన్నెండో ఏట సెకండ్ ఫారం చదువుతుండగా మొదటిసారిగా చిన్న చిన్న కథలు రాసి, కొన్ని బొమ్మలు తెల్లకాగితం మీద పెన్సిల్‌తో గీసి చందమామకు పంపించాను. వారి దగ్గరనుంచి నాకో ఉత్తరం వచ్చింది, బొమ్మలు పెన్సిల్‌తో కాదు, ఇండియన్ ఇంకుతో గీయాలి అంటూ. నా కథలు ప్రచురణకు తీసుకోకపోయినా వాళ్ళ దగ్గరనుంచి నాకు ఉత్తరం రావటమే నాకో పెద్ద విజయంలా ఉప్పొంగిపోయాను. ఆ ఉత్తరాన్ని అందరికీ చూపించుకుంటూ తిరిగాను చాలాకాలం.

## అనువాదం చేయడం ఎంతో ఉపయోగపడింది

హిందూ కాలేజీలో మన్నవ గిరిధరరావుగారు లెక్చరర్‌గా పనిచేస్తుండే వారు. అప్పటికే ఆయన పేరున్న రచయిత. ఆయనతో నాకు పరిచయం పెరిగింది. ఓ రోజు వారితో 'నాకు కథలు రాయడం నేర్పండి' అన్నాను. 'అదేం బ్రహ్మ విద్య కాదు. ఓ పది ఇంగ్లీషు కథలు తెలుగులోకి తర్జుమా చేయి.. నువ్వు పదకొండో కథ స్వంతంగా రాయగలుగుతావు' అన్నారు. 'ట్రాన్స్‌లేట్ చేయటం వలన కథ ఎలా మొదలు పెట్టాలో, ఎలా నడపాలో, ఎలా ముగించాలో అర్థమవుతుంది' అన్నారు. దాంతో కథలు అనువదించటం మొదలు పెట్టాను. ఆ కథలను గిరిధరరావుగారే చదివి తగిన సూచనలు ఇచ్చేవారు. ఆ కథలు ప్రచురించాలంటే మూల రచయిత నుంచి అనుమతి కావాలి కాబట్టి వాటిని ఏ పత్రికకూ పంపలేదు. అయితే అలా అనువదించడం నేను కథలు రాయటానికి ఎంతో దోహదం చేసింది.

## 'నేను ఓడిపోయాను'

1957లో నా మొదటి కథ 'స్వం..నాస్తి' రాశాను. అది 'గుంటూరు పత్రికలో అచ్చయింది. తొలి రోజుల్లో నా భార్య 'మాధురి' పేరుతో కథలు రాసేవాడిని. చాలా కాలంపాటు నా కథలు తరచూ తిరిగి వస్తుండేవి. అప్పుడే తారకరామారావు గారి కథ ఒకటి ఆంధ్రపత్రికలో వచ్చింది. ఆంధ్రపత్రికలో కథ పడటం అంటే పెద్ద ఎఛీవ్‌మెంట్ కిందే లెక్క.. వెంటనే ఆయనను కలిశాను. ఆయన నాకు కాలేజీ మేటు. నా ప్రాథమిక విద్యలో వాళ్ళ నాన్నగారే నాకు గురువు. రామారావు గారు ఏ విషయాన్నయినా చాలా తేలిగ్గా తీసుకుంటారు. నా కథలు తిరిగొస్తున్నాయని, అచ్చు కావాలంటే ఏం చేయాలని వారిని అడిగాను. ఆయన ఫక్కున నవ్వేసి 'ఏం లేదు.. ఓ హీరోను తీసుకో, ఓ హీరోయిన్ను తీసుకో.. వాళ్ళ నడుమ ప్రేమ పెట్టేసి పార్కులమ్మట తిప్పి మధ్యలో విలన్ని తీసుకురా.. హీరో చేత విలన్ని తన్నించి హీరోయిన్నిచ్చి పెళ్ళి చేసెయ్'. అన్నారు. అదే ఫార్ములాతో 'గెలుపు నీదే' అనే కథ రాసి ఆంధ్రపత్రికకు పంపాను. అది మూడు వారాల్లో 'నేను ఓడిపోయాను' అనే పేరుతో సెంటర్ పేజి అంతా బొమ్మతో వచ్చేసింది. అప్పటి నుంచి ఇక తిరిగి చూసుకునే అవసరం లేకుండా పోయింది. వరుసగా కథలు రాస్తూనే ఉన్నాను. ఇప్పటికి 260కి పైగా కథలు, 31 నవలలు, పది దాకా రేడియో నాటికలు, రెండు స్టేజి నాటికలు రాశాను.

## పుస్తకాలు కొని చదివే ఓపిక ఎవరికుంది?

1960, 70 ప్రాంతాల్లో నావి తొమ్మిది పుస్తకాలు ప్రచురించబడ్డాయి. కానీ అవి ఇప్పుడు ఎక్కడా లభ్యం కావడం లేదు. నాకు నేనుగా పుస్తకాలు ప్రచురించుకోవటానికి అంతగా ఎన్నడూ ఉత్సాహం చూపలేదు. పుస్తకాలుంటే బాగుంటుంది కదా అని మిత్రులు అంటుండేవారు. పుస్తకాలు కొని చదివే ఓపిక ఇప్పుడెవ్వరికుంది? టీవీ ముందు కూర్చుంటే కావల్సినంత కాలక్షేపం లభిస్తోంటే పుస్తకాలు చదివే శ్రమ ఎందుకని నేటి తరం ఆలోచిస్తోంది. ఈమధ్య నా కథలను మూడు సంపుటాలుగా తీసుకు వచ్చాము.

## చివరిదాకా చదివించేదే మంచి కథ

నేనూ కాకాని చక్రపాణి అన్నాచెల్లెలి బిడ్డలం. మాది ఒకే ఊరు. చిన్నప్పటినుంచీ ఎంతో ఆత్మీయంగా తిరిగాం. నేను కథలు రాయటం మొదలు పెట్టినప్పటి నుంచీ చాలా వాటికి చక్రపాణి మెరుగులు దిద్దాడు. వివిధ మనస్తత్వాల వ్యక్తులను పాత్రలుగా మలచి కథలు రాసాను. మానసిక విశ్లేషణతో కథలు రాయటం నాకిష్టం. సస్పెన్స్ సీరియల్స్ రాశాను. నా కథల్లో, నవలల్లో కలిపి రెండు వేలకు పైగా పాత్రలను సృష్టించాను. నేను రాసినవన్నీ మంచి కథలా అంటే కావు. అలా రాసిన రచయితలు ఉన్నారేమో నాకు తెలియదు. నా ఉద్దేశ్యంలో సహజంగా వుండి, అశ్లీలత లేకుండా మొదటి నుంచి

## నచ్చినవి

**కథ :** నల్లజర్ల రోడ్డు (తిలక్)

**కథకుడు :** మధురాంతకం రాజారాం

**నవల :** జయం (మల్లాది వెంకటకృష్ణమూర్తి)

**కవి :** తిలక్

**పాట :** భానుమతి పాడిన పాటలన్నీ

**గాయని :** భానుమతి

**గాయకుడు :** ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం

**నటి :** భానుమతి

**నటుడు :** నాగేశ్వరరావు

**వ్యక్తి :** శ్రీసుభా

**వంట :** వేపుళ్ళు

చివరిదాకా ఆపకుండా చదివించేదే మంచి కథ. నా కథల్లోని పాత్రల్లో మంచి వారున్నారు. చెడ్డవారున్నారు. దొంగలున్నారు దొరలున్నారు. నాస్తికులున్నారు, ఆస్తికులున్నారు. సంసార స్త్రీలున్నారు, వ్యభిచారుణులున్నారు. నా వద్ద సబ్జక్టు ఉన్నా మంచి ముగింపు దొరక్క సంవత్సరాల తరబడి రాయకుండా ఆపిన కథలున్నాయి. మంచి ముగింపు ఉంటే కథను అద్భుతంగా సృష్టించగలం అనేది నా నమ్మకం.

### నాకు మిత్రులెక్కువ

నాకు 1963లో శ్రీసుభాతో పరిచయం అయింది. ఇద్దరం ఒకేచోట పని చేశాం. చాలాకాలం ఒక చోట ఉన్నాం. ఎక్కడకు వెళ్ళాలన్నా ఇద్దరం కలిసే వెళ్ళేవాళ్ళం. సంవత్సరం క్రితం అయన పోయారు. ఇప్పుడనిపిస్తోంది నేను పుస్తకాలు ప్రచురించడంలో ఆలస్యం చేశానా అని. ఆయన ఉంటే ఈనాడు ఎంత సంతోషించేవాడో. నాకు మిత్రులెక్కువ. రచయితల్లోనూ చాలామంది మిత్రులున్నారు. సామాన్యంగా నాకు మిత్రులయినవారిని నేను నా అంతటగా వదిలిపెట్టను. వారితో స్నేహాన్ని కొనసాగిస్తూనే ఉంటాను.

### రాసిన వన్నీ గొప్ప కథలు కావు


ఇప్పుడు మానసిక సంఘర్షణకు గురి చేసే కథలు చాలా తక్కువ వస్తున్నాయి. నేను ఎండింగ్ ఉంటేగానీ కథ రాయలేను. కథ చెడు వైపు కాకుండా మంచివైపు చదువరుల్ని నడిపించాలి. చదువరిని డిస్టర్బ్ చెయ్యాలి. అలాంటివే మంచి కథలు. అయితే ఇప్పుడు రాస్తున్న కొత్తవాళ్ళకు ఓపిక లేదు. కథ రాసిన వెంటనే పత్రికకు పంపిస్తారు. పత్రికలో పడకపోతే వారిని తిడతారు. బాగులేని కథ వెనక్కు వస్తే సంతోషించాలి కాని వారిని తిట్టడం ఎందుకు? ఆ కథను తిరగరాస్తే ఇంకా మంచికథ అవుతుంది. అయితే కొంతమంది డిస్కరేజ్ అయి కథలు రాయడం మానేస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కథా ప్రపంచంలోకి బాగా రాసేవాళ్లు కూడా ఎంటర్ అయ్యేది కొంచెం కష్టమే! చాలామంది కథను పాలిష్ చేయరు. డైరెక్ట్‌గా రాసి పంపుతారు. దాన్ని నేను ఒప్పుకోను. రెండుమూడుసార్లు తిరగరాస్తే కథ బాగా వస్తుంది. ముఖ్యంగా కొత్తవారు కథలను తిరగరాయాలనే విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఎవరయినా రాసినవన్నీ గొప్ప కథలుకావు.

### మహీధర రామమోహనరావుగారు మా ఇంటికి వెతుక్కుంటూ వచ్చారు

ఏ రచయితకయినా కథలకు బహుమతులు రావడమే కదా ఆనందం. నాక్కూడా అంతే! 1976లో 'ధేనుక' అనే నవల రాసి 'యువ' పత్రికకు ఇచ్చాను. వారు ఆ నవలను వేయడానికి మొదట భయపడ్డారు. నవల నచ్చితేనే వేయండి, మీకు ఇబ్బంది అయితే వేయకండి అన్నాను. చివరకు వారు ఆ నవలను వేశారు. ఒక రోజు పొద్దున్నే మా ఇంటి తలుపును ఎవరో తట్టారు. తలుపు తీస్తే మహీధర రామమోహనరావుగారు. నా నవల చదివారట. యువ పత్రిక వారిని అడిగి మా చిరునామా తీసుకుని నన్ను అభినందించటానికి మా ఇంటికి వెతుక్కుంటూ వచ్చారు. ఆ సంఘటన చాలా ఆనందం కలిగించింది.

### నాకు శ్మశానం అంటే భయం లేదు

నాకు నాలుగేళ్ళ వయసులోనే మా నాన్నగారు చనిపోయారు. నా పదమూడో ఏట మా అమ్మగారు కూడా పోయారు. అప్పటినుంచి నాకు శ్మశానం అంటే భయం లేకుండా పోయింది. అమ్మానాన్న పోయిన బాధ కన్నా ఎక్కువగా నన్ను బాధించేవి వేరే ఏవీ లేవు. అప్పుడే ఏడ్చేశాను. అందుకేనేమో, ఎవరయినా చనిపోయినా ఇప్పుడు నాకు ఏడుపు రావడం



కవిరాజు, శ్రీసుభా, పాలకోడేటితో...

లేదు. అయితే బాధ మాత్రం ఉంటుంది.

### ఇప్పటికీ నిత్య విద్యార్థినే!

స్వతహాగా నేను మితభాషిని. చదువుకోవడం, రాసుకోవడం ఇష్టపడతాను. నా కథల్లోని పాత్రలు కూడా నాలానే ఉంటాయి. నా కథల్లోని పాత్రలు ఎక్కడా గొంతు చించుకుని అరవవు. వికృత చేష్టలు చేయవు. సమాజంలో కసి, ద్వేషం, పగ, ప్రతీకారాలున్నాయి. అలాంటి పాత్రలు నా కథల్లో ఉన్నప్పటికీ ఎప్పుడూ హద్దులు దాటవు. రచయితగా కీర్తి గడించటం కోసం కథల్లో జిమ్మిక్కులు చేయడం నాకు ఇష్టం ఉండదు. డెబ్బయ్ ఎనభై దశకాల్లో ఏడాది పొడవునా అన్ని ప్రముఖ వార, మాస పత్రికల్లో నా రచనలు వచ్చాయి. వాటన్నింటిలో మధ్య తరగతి కుటుంబాలు, ఆ కుటుంబాల్లోని మహిళలు, వారి సామాజిక సమస్యలే ప్రధాన ఇతివృత్తాలుగా ఉంటాయి. ప్రభుత్వాసుపత్రుల్లో రోగుల ఇక్కట్లు మొదలు వేశ్యల జీవితాల దాకా నాకు అన్నీ కథా వస్తువులే! నాకు కథల్లో ఇంతటి వస్తు విస్తృతి ఎలా సాధ్యం అయిందనుకుంటున్నారు? నేనిప్పటికీ నిత్య విద్యార్థినే! సమాజాన్ని అధ్యయనం చేస్తూనే ఉన్నాను.

-సుంకోజి దేవేంద్రాచారి

**నాకు నచ్చిన నా కథ**

# చీకటి పువ్వు

- పి.ఎస్. నారాయణ

**అర్ధరాత్రప్పుడు గేటు చప్పుడయితే... నిద్రపట్టక పడుకొని పుస్తకం చదువుకుంటున్న నేను ఆశ్చర్యపోయాను.**

**ఆ సమయంలో వస్తారనుకుంటున్న వాళ్ళు ఎవ్వరూ లేరు. మంచం మీద నుండి లేవకుండానే కిటికీ రెక్క తెరిచి తొంగి చూశాను.**

**రోడ్డుమీద గుడ్డి దీపపు వెలుగులో ఓ స్త్రీ గేటు ముందు నిలబడి స్పష్టంగా కనబడింది.**

**''ఎవరూ?'' అటువైపుకే వింతగా చూస్తూ అన్నాను.**

**''ఒక్కసారి తలుపు తీస్తారా?''**

**''ఎవరు కావాలి మీకు?''**

**''తలుపు తీయండి... ప్లీజ్!''**

నాకు చాలా ఆశ్చర్యమేసింది. లైటువేసి టైం చూచాను. పన్నెండు దాటి పది నిముషాలయింది. ఇంట్లో ఎవ్వరూ లేరు. శ్రీమతి కొత్తగా తీసుకున్న ఈ అద్దెఇంట్లో పాదాన్ని మోపనేలేదు. మొదటాట సినిమా చూసి, హోటల్లో భోజనం చేసి ఇంటికి వచ్చేటప్పటికీ పది దాటింది. ఆపైన అన్నీ సర్దుకొని గేటుకు తాళం వేసేటప్పటికి పదకొండు. నిద్రకోసం పుస్తక పఠనం చేస్తుంటే ఈ అగంతకురాలి ఆగమనం.

అంతా కొత్తప్రదేశం.... కొత్తమనుష్యులు... ఎవ్వరో? ఏమిటో?... ఎవరైనా ఆడకూతురు అర్ధరాత్రి తలుపు తడుతుంటే... ఏం అవసరమొచ్చిందో నిర్మొహమాటంగా వెళ్ళిపొమ్మనలేం గదా...

బయట లైటు వేశాను. టీపాయ్ మీద పెట్టిన గేటు తాళం చెవి తీసుకొని తలుపు తీశాను.

ఎదురుగ్గా గేటును ఆనుకొని నిలబడి వున్నది ఆమె. ఆమె చూపులు ఆత్రంగా వున్నాయి. ముప్ఫయి ఏళ్ళు వుంటాయేమో... ఎర్రగా బొద్దుగా వున్నది. నుదట పెద్ద కుంకుమ బొట్టు. నల్లంచు ఎర్రచీరలో ఆమె అంత గుడ్డి వెలుగులోనూ ధగధగా మెరిసిపోతున్నది. ఆమెను అంతకు ముందు ఎక్కడా చూచిన గుర్తు రావటం లేదు.

తాళం తీశాను విచిత్రంగా ఆమెనే చూస్తూ: ''ఏమిటి సంగతి... ఎవరు కావాలి?''

గేటు తీసిన తరువాత ఆమె లోపలకు రెండడుగులు వేసి, ''రామ్మూర్తి గారు పోయారు!'' అన్నది తలవంచుకొని. ఆమె గొంతులో వణుకు, ఆమె మొహంలో భయం... మా కారిడార్ లైటు వెలుగులో స్పష్టంగా కనబడుతున్నాయి.

''రామ్మూర్తిగారు ఎవరు?'' నేను మరింత ఆశ్చర్యపోయాను.

''అదేమిటి... మీకు తెలియదా?''

''నేను ఈ ఇంట్లోకి వచ్చి ఇంకా వారం కాలేదు. నాకు ఇక్కడెవ్వరూ పరిచయం లేదు!''

నేను సెంటర్‌కు కాస్త దూరమైనా విశాలంగా చుట్టూ ఖాళీస్థలం వున్న ఈ ఇల్లు బాగా నచ్చడంతో అద్దెకు తీసుకొని చేరాను. చుట్టూ ఇళ్ళు వున్న మాట వాస్తవమేగాని.... ఇళ్ళకంటే ఖాళీ స్థలాలే ఎక్కువగా వున్నాయి... ఇంటి ఆవరణలో ఇంతకుముందు అద్దెకున్న వాళ్ళు వేసిన పూలమొక్కలు నన్ను ఎంతగానో ఆకర్షించినాయి... అందునా పూల మొక్కలంటే నా శ్రీమతికి మహాప్రీతి.

''మీ పక్కింటాయనండి!''

''ఆ ఇంట్లో ఇంకెవ్వరూ లేరా?''

''ఇంటివారు ఊరికి వెళ్ళారట!''

ముక్కూమొహం తెలియని ఆయనపోతే నేనేం చేయాలో నా కర్థం కాలేదు. బహుశా ఆమె ఒంటరిగా వుండి వుండవచ్చు. నేను ఇప్పుడు వెళ్ళి బంధువులనెవరినైనా పిలుచుకు రావాలేమో?....

''నన్నేం చేయమంటారు?''

''ఒక్కసారి మీరు వస్తే బాగుంటుంది!''

కాదనలేని పరిస్థితి.... వాళ్ళు తెలిసినవాళ్ళయినా, కాకపోయినా ఆ సమయంలో ఓ మనిషి సాయం తప్పనిసరి!

ఇంటికీ, గేటుకీ తాళంవేసి వందడుగుల దూరంలో వున్న ఆ ఇంట్లో కాలు పెట్టాను.

ఆ ప్రదేశమంతా నిశ్శబ్దంగా వుంది. లోపల యాభైయేళ్ళకు పైబడ్డ మనిషి మంచం మీద పడివున్నాడు. రెండుచేతులూ క్రిందకు వాలి వున్నాయి. మెడ ఓ పక్కకు ఒరిగి వున్నది.

''ఏమైంది అసలు?'' ఆమె వంకే చూస్తూ అడిగాను.

''పడుకొని వున్న ఆయన ఉన్నట్లుండి గుండెల్లో నొప్పి అన్నారు... మాత్ర కావాలి అన్నారు... ఎక్కడున్నాయి అంటుండగానే గిలగిలా కొట్టుకుంటూ పడిపోయారు. మరుక్షణంలోనే ప్రాణం పోయింది!'' ఆ భయానక దృశ్యం ఆమె కంఠాన్ని నొక్కుతుండగా మాటలు తడబడుతున్నాయి.

''మీ వాళ్ళెవ్వరూ లేరా ఇంక?'' భయం భయంగా చూస్తున్న ఆమెనే చూస్తూ అడిగాను.

''ఆయన వాళ్ళెవరూ లేరు అనుకుంటున్నాను!'' తలవంచుకొని నంగి నంగిగా అన్నది.

''అదేమిటి?''

ఆమె తలెత్తలేదు.

''ఇంకా ఇక్కడ చుట్టుపక్కల ఇళ్ళల్లో మీకు తెలిసిన వాళ్ళే లేరా?''

''ఇక్కడ ఆయనకు తెలిసిన వాళ్ళెవ్వరో నాకు తెలియదు!'' ఒక్కక్షణం ఊపిరి తీసుకోవటానికి అన్నట్లుగా ఆగింది. ''ఆయనకు శ్వాస ఆగి పోవటంతో నాకు ఏమీ తోచని పరిస్థితి ఏర్పడింది... ఇంత పెద్ద ఇంటిలో నేను ఒక్కదాన్నే

వుండిపోయాను... భయంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ బయటకు వచ్చాను... ఎవర్ని పిలవాలో నాకు అర్థం కాలేదు. పక్కనే ఉన్న మీ ఇంట్లో దీపం వెలుగుతుండడంతో మిమ్మల్ని పిలిచాను.''

నాకు చాలా వింతగా వున్నాయి ఆమె మాటలు. ''ఆయనకు తెలిసిన వాళ్ళెవ్వరో మీకు తెలియక పోవటమేమిటి?'' ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాను.

నా ప్రశ్నకు ఆమె ముఖం తెల్లగా పాలిపోయింది. ఆమె పెదిమలు నోటి నుండి మాటల్ని వెలువరించలేనట్లు వణుకుతున్నాయి. చటుక్కున తలవంచుకున్నది.

''నేను ఈ రాత్రికి ఆయనకు ఆనందాన్ని అందివ్వటానికి వచ్చిన ఆడదాన్ని... అప్పుడప్పుడూ ఆయన నన్ను ఇలా పిలుస్తుండడంతో ఆయనతో నాకు కొద్దిగా పరిచయం ఏర్పడింది గాని... ఆయన వాళ్ళెవ్వరో నాకు తెలియదు!'' చటుక్కున వెనక్కు తిరిగి ముఖాన్ని గోడవైపు పెట్టుకొని నిలబడింది. ఆమె కంఠం భయంతో జీరబోయింది.

నేను అవాక్కే అయ్యాను – ఇదెక్కడి నిజం?

అతడికి యాభైఏళ్ళకు పైబడి వుండవచ్చు. పెద్ద ఉద్యోగం లోనే ఉన్నట్లున్నాడు – హుందాగా ఉన్నాడు... మల్లెపువ్వు లాంటి ధోవతిని లుంగీలా కట్టుకున్నాడు... తెల్ల టీలాల్చీ... మెళ్ళో ఒకపక్కకు వ్రేలాడు తున్న బంగారుగొలుసు... ఆ వయస్సులో గూడా ఎక్కడా ఒక తెల్ల వెంట్రుక లేచి జుట్టు – రంగేసుకున్నాడేమోనని అనుమానం కలిగినా నిర్ధారించుకోలేక పోయాను.

నాకేం చేయాలో తోచలేదు.... చచ్చిన ఆ మనిషిని... చచ్చినట్లు బిగుసుకుపోయి గోడ వైపుకు తిరిగి నిలబడి వున్న ఈ ఆడమనిషిని మార్చి మార్చి చూస్తూ వుండిపోయాను కొన్ని నిముషాల వరకు...


''ఏం చేద్దామంటారు ఇప్పుడు... అయితే!'' నేనే తరువాత మొట్టమొదటి సారిగా నోరు తెరిచింది.

''ఇంకెవరినైనా పిలుద్దామంటారా?''

''వాళ్ళు వచ్చి మాత్రం ఏం చేస్తారు?''

''మీ ఇష్టం! సరే అయితే..''





బయటకు అడుగు వేస్తున్న వాడినల్లా ఆగి ''మీరొక్కరే వుండగలరా?'' అన్నాను.

''నేనింతకంటే భయంకర వాతావరణంలో పెరిగాను!''

చటుక్కున అడుగులు బయటకు వేసేశాను.

గేటుతీస్తుంటే ఒక ఆలోచన వచ్చి వెనక్కు తిరిగి మళ్ళా లోపలకు వెళ్ళాను.

''టేబుల్‌మీద డైరీ లాంటిది ఏమైనా వున్నదేమో చూడండి... ఫోను నంబర్లు గాని... బంధువుల అడ్రసులుగాని దొరకవచ్చు!''

ఆమె గోడ పక్క నుంచి టేబుల్ దగ్గరకు వెళ్ళి చిందరవందరగా పడి వున్న పుస్తకాలను తీసి చూడసాగింది.

సహజంగా దొరకాలి... ప్రతి ఇంట్లోనూ అడ్రసులూ, ఫోను నంబర్లు రాసి వున్న పుస్తకం వుండటం కద్దు!

''ఎక్కడ పని చేస్తుంటారు ఈయన?''

''ఏదో కంపెనీలో... నెలకు యిరవై రోజులు ఊళ్ళమీదే తిరుగుతుంటారు!''

''అవునూ – ఇంతకు ముందుగూడా ఒకటి రెండుసార్లు ఇక్కడకు వచ్చినట్లు చెప్పావు గదా... అప్పుడూ ఇంట్లో ఎవరూ లేరా?'' మీరు అని ఆమెను గౌరవించటం అనవసరమనిపించింది నాకా క్షణాన.

నా మాటతీరు ఆమెను క్షణం విభ్రాంతి పరిచినా – ఒక్క క్షణం నా ముఖంలోకి చూచి తలవంచుకున్నది. పెదిమకొరుక్కుంటూ ''ఊఁహూ... ఇంట్లో ఎవరైనా వుంటే నేను ఇక్కడకు వచ్చే అవకాశం వుండేది కాదేమో!'' అన్నది బరువుగా.

''ఈయన గారికి భార్యా పిల్లలూ వున్నారా?''

''ఉన్నారనే అనుకుంటాను!''

''నీ మూలకంగా వాళ్ళు వెళ్ళిపోలేదు గదా!''

చురకత్తిలా ఆమె నా వంక చూచింది. ''నా పరిచయం చెప్పాను గదా... నా మూలకంగా వాళ్ళను వదిలేసే పరిచయం ఆయనకూ నాకూ లేదు!'' ఆమె నా మాటలకు బాధపడుతున్నట్లుగా ఆమె కంఠంలో జీర స్పష్టంగా వినబడింది.

నేను చిరునవ్వుతో గూడలెగరేశాను. అయినా – వాళ్ళలాంటి వాళ్ళతో నాకెందుకు. అడ్రసుగాని, ఫోను నంబరు గాని దొరికితే బయటకు వెళ్ళి నలుగురికీ చెప్పి వాళ్ళ వాళ్ళను పిలిపిస్తే సరిపోతుంది.

నన్ను నేను సంబాళించుకుంటూ, ''సారీ.. డైరీ దొరికిందా?'' అన్నాను వెనక్కు తిరిగి.

ఆమె టేబుల్ మీద పుస్తకాల్ని, పక్కన అలమరలోని పుస్తకాల్ని విడదీసి చూస్తోంది.

రెండు నిముషాల భయంకర నిశ్శబ్దం.

''వీరిది ఏ ఊరో తెలుసా?''

''విజయవాడ అనుకుంటాను!''

''అది నీకెలా తెలుసు?'' సూటిగా అడిగాను.

''నాకు ఆయనతో అక్కడే మొదటిసారి పరిచయం అయింది గనుక!'' చాలా సహజంగా అన్నది.

రహస్యం తెలియనంతవరకూ దోబూచులాడటం సహజం. ఒకసారి బయట పడిం తరువాత ఇంకా దాచేటందుకేమున్నది?



''ఐ.సీ''

''ఇదుగోనండి.. ఈ డైరీ చూడండి! చాలా అడ్రసులున్నట్లున్నయి!'' అన్నది ఓ చిన్న పుస్తకం నా చేతికిస్తూ.

అది ఈ సంవత్సరపు డైరీ... ఆత్రంగా పేజీలు తిప్పుతుంటే మొదటి చిరునామా మీదే నా దృష్టి కదలకుండా నిలిచిపోయింది. సత్యనారాయణపురం, విజయవాడ అడ్రసు ఆర్.సుగుణ పేరు మీద ఉన్నది. ఫోను నంబరు గూడా వున్నది. మొదటిపేజీ తిప్పి రామ్మూర్తి ఇంటి పేరు చూచాను. ఆర్ అనే వున్నది.

ఇంకేవో అడ్రసులున్నయిగాని – ఫోను నంబరు ఆమెది మాత్రమే వుండటంతో ఆమెకే ఫోను చేయటం అన్ని విధాలా ఉత్తమమనిపించింది. ఆఫీసు నంబర్లున్నా – ఈ అర్ధరాత్రి పూట వాటితో అంత లాభం వుండక పోవచ్చు.

ఆమె అతగాడి భార్య అయివుండవచ్చు – కాదూ – ఫోను నంబరల్లా రాసుకున్నాడు అంటే చాలాదగ్గర మనిషి అయినా అయివుండవచ్చు... ఆమె చెబుతుంది మిగతా వివరాలన్నీ.

''ఇక్కడ ఫోను ఎవరింట్లోనైనా వున్నదా?''

''తెలియదు''

–ఇక ఆమెను ఏవిషయమూ అడగటం అనవసరమనిపించింది. బయటకు వచ్చాను.

పండు వెన్నెల. ఇళ్ళన్నీ చలికి దుప్పట్లు కప్పుకొని ముడుచుకు పడుకున్న మనుష్యుల్లా అలికిడి లేకుండా వున్నాయి. టెలిఫోన్ స్తంభాల్ని చూచాను. ఆ ప్రదేశంలో కొన్ని ఇళ్ళలో ఫోన్లు ఉన్నయ్యనే విషయం నాకు కాస్త ధైర్యాన్నిచ్చింది.

పదిళ్ళ అవతల ఒక ఇంట్లోదీపాలు వెలుగుతుంటే అటువైపుకు నడిచాను. ఆ ఇంట్లో ఫోను కూడా వున్నది. అంతేగాదు – నాకు పెద్దరిలీఫ్ ఇస్తున్నట్లుగా ఆ ఇంట్లో నుంచి మాటలు గూడా వినబడుతున్నాయి.

దగ్గరకు వేసి వున్న గేటు తీసుకొని లోపలికి వెళ్ళి తలుపు మీద చిన్నగా కొట్టాను.

''ఏమండి?''

''ఎవరు?''

తలుపులు తెరుచుకున్నాయి. లుంగీ కట్టుకొని, పొడుగు చేతుల చొక్కా మీద ఆఫ్‌స్వెట్టర్ వేసుకున్న మనిషి సగం తెరిచిన తలుపు వెనుక నిలబడి ''ఎవరు?'' అన్నాడు మళ్ళా.

వాళ్ళు కూర్చొని పేకాడుతున్నట్లుగా అర్థమయింది. మందు కొడుతున్నా కొడుతుండవచ్చు. గదంతా సిగరెట్లు తగలేస్తున్నందుకు నిదర్శనంగా పొగ ఘుప్పుమంటోంది.

''క్షమించాలి... ఆ చివరి ఇంట్లో వుంటాను నేను... అర్జంటుగా ఓ ఫోను చేయాలి... బహుశ ఆయన తెలుసేమో గూడా మీకు... రామ్మూర్తిగారు పోయారు!'' ఆయన వంకే చూస్తూ అన్నాను.

''ఏ రామ్మూర్తిగారు?'' ఆయన కళ్ళు చికిలించాడు ఆలోచిస్తున్నట్లుగా.

నా మాటలు వింటూనే ఆయన వెనుకగా నాలుగు తలకాయలు చేరాయి.

''అదుగోండి... ఆ పడమరవైపు లైటు వెలుగుతున్నది చూడండి... ఆ యింట్లోవారు''.

అందరూ బయటకు వచ్చారు.

చివరిగా వచ్చిన లావుపాటి ఆయన ''ఓహో! ఆ పెద్దమనిషా... ఏమైందిటా... చచ్చాడా పాపం!'' అన్నాడు నవ్వుతూ.

నాకు ఆశ్చర్యం కలిగించింది ఆ మాటతీరు. మనిషి మీద గౌరవం అతగాడి నడత మీదే ఆధారపడి వుంటుంది.

''ఏమైందో తెలియదండి... ఎవరో ఆడమనిషి మాత్రం వున్నది!''

''ఆమె భార్య మాత్రం కాదు... రోజుకో ఆడదాన్ని తెచ్చుకునే అతగాడు చస్తే పట్టేందుకు మనుష్యులు కూడా దొరకరు పాపం... రోగ్... మన కాలనీకి చెడ్డపేరు తెస్తున్నాడు. ఆ ఇంటాయన నోట్లో నాలికలేని మనిషి... లక్షసార్లు చెప్పాను. వాడి చేత ఖాళీ చేయించవయ్యా బాబూ అని.. వింటేనా?''

''సరే! ఎలాంటి వాడయినా... ఇప్పుడు పోయాడు.. ఏం చేయాలో అర్థం గాక ఇలా వచ్చాను''.

"మీకెలా తెలుసు వాడు?" అతడే అన్నాడు.

"నాకూ తెలియదండి... వారం రోజుల క్రితమే ఆ పక్కింట్లో దిగాను నేను!"

క్షణం నిశ్శబ్దం. ఎవరికి వాళ్ళు ఒకళ్ళ ముఖాల్లోకి ఒకళ్ళు చూచు కుంటున్నారు.

"ఇప్పుడేం చేద్దామంటారు?" లుంగీమీద స్వెట్టర్ వేసుకున్న పెద్దమనిషే మెట్టమొదటిసారిగా ఆ నిశ్శబ్దానికి కొరివి పెడుతున్నట్లుగా అన్నాడు.

"ఆయన డైరీలో ఒక ఫోను నంబరు దొరికింది.... ఫోనుచేసి చెబితే ఆయన తాలుకూ మనుష్యులు ఎవరైనా వస్తారేమోనని అనుకుంటు న్నాను!" నేను చిన్నగా అన్నాను.

"చచ్చిగీపెట్టుకున్నా ఎవ్వరూ వస్తారని నేననుకోను... అయినా ప్రయత్నిద్దాం పట్టండి!" మొదటతనే అన్నాడు.

లోపలకు వెళ్ళాం అంతా. డైరీలో నంబరు చూస్తూ "విజయవాడ" అన్నాను. ఎస్టిడి కోడ్ నంబరు చూచి డయల్ చేస్తూ "ఈలాంటి వెధవ వార్తను నేనైతే చెప్పలేను... మీరే చెప్పండి!" అన్నాడు పాన్‌తో గారపట్టిన పళ్ళన్నీ బయటకు పెట్టి నవ్వుతూ అతడు.

రిసీవర్‌ని అందుకున్నాను మాట్లాడకుండా. అర్ధరాత్రి అవ్వటంతో మొదటి ప్రయత్నంలోనే నంబరు దొరికింది. అయిదు నిముషాల తరువాత గాని అటు వైపు ఫోను ఎత్తలేదు.

"నేను హైదరాబాద్ నుండి మాట్లాడుతున్నాను... సుగుణగారు కావాలి!"

"నేను సుగుణను... మీరెవ్వరూ?"

"మీకు రామ్మూర్తిగారు తెలుసా?"

"ఆఁ"

"ఆయన మీకు బంధువులా?"

ఒక్క క్షణం నిశ్శబ్దం తరువాత, "అవును" అన్నమాట వినబడింది.

"మీకో దుర్వార్త తెలియబరచటానికి విచారంగా వున్నది" నాకు నిజంగానే అలాంటి వార్త చెప్పటానికి బాధగా వున్నది.

"చెప్పండి... యాక్సిడెంట్ అయిందా? లేకపోతే ఎవరైనా తన్నారా? చచ్చిపోయాడా?" చాలా కరుకుగా అన్నది ఆ కంఠం.

నాకు క్షణం ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. తడబడ్డాను ఆమె అడిగిన ప్రశ్నలకు.

"ఆయన పోయారు!"

"థాంక్ గాడ్! కాళ్ళూ చేతులూ విరిగాయి.... వచ్చి ఆసుపత్రిలో సేవ చేయండి అంటారేమో ననుకున్నాను!"

నాకు చాలా అసహ్యమేసింది ఆ మాటతీరు... ఆమె ఎవ్వరైనా అవ్వవచ్చు.... చచ్చిన మనిషి ఎంత నికృష్టుడైనా అవ్వవచ్చు... అతగాడి చావు కబురుకు అలాంటి ప్రతిస్పందన వస్తుందని – అందునా ఓ స్త్రీ నుండి – ఊహించలేక పోతున్నాను... నాకు నోట మాట పెగల్లేదు...

"ఇప్పుడు నన్నేం చేయమంటారు?" అన్నది విసురుగా – అవతలి ఆ మహాతల్లి.

"మీరెవ్వరో చెప్పనే లేదు!"

"మీరు అడగలేదు... నేను చెప్పలేదు... లోకం దృష్టిలో ఆయనకు నేనే భార్యను!"

"ఐసీ"

"ఫోను పెట్టేస్తున్నాను".

"మీరు వస్తున్నారా అయితే?"

"వెధవది మెళ్ళో పసుపుతాడు త్రెంపుకునేటందుకు నేను అంతదూరం పడల్లా రావాలా... ఇక్కడే కృష్ణ ఒడ్డున నేనా పనిని చేసుకోగలను లేండి... మీలాంటి మిత్రులు అండ ఆయనకు వుండగా – బ్రతికి వున్నన్నాళ్ళూ తాళి కట్టిన భార్యఅవసరం లేకపోయింది... చచ్చిం తరువాత ఇంకెందుకు?"

నా మొహాన ఫట్‌మని కొట్టినట్లుగా ఫోను క్రెడిల్‌మీద పడేసిన శబ్దమయింది.

నా పరిస్థితికి నేను క్రుంగిపోయాను. ఆమె తన భర్తను తూలనాడిన మాట వాస్తవమే గాని – అలాంటి భర్తకు నన్ను మిత్రుడిగా భావించి నన్నూ దూషించడం నా మనస్సుకు చాలా కష్టాన్ని కలిగించింది.

రోటిలో తలపెట్టాను. బొప్పికట్టితే ఫరవాలేదు గాని – పచ్చడి అయ్యేలా వున్నది. ఫోను పెట్టేశాను.

"పాపం ఏమంటోంది ఆమె?" స్వెట్టర్ ఆయన అడిగాడు.

"రానని ఖచ్చితంగా చెప్పింది" నాన్చడం నాకిష్టం లేదు అన్నట్లుగా నేనూ సూటిగా చెప్పేశాను.

"సరైన నిర్ణయమే తీసుకున్నదన్నమాట... ఎక్కడ వస్తానంటుందోనని నేను భయపడి చచ్చాను!" అన్నాడు పీలగా ఆరడుగుల పొడుగున్న ఒకాయన.

నేను విచిత్రంగా అతడి వంక చూచాను.

"ఆమె వస్తే మీకు దేనికండీ భయం?"

"భయం అంటే భయం కాదు... అలాంటి దరిద్రుడి భార్య గూడా భర్త చచ్చాడని ఏడిస్తే – ఇక ఈ దేశం ఎటు పయనిస్తున్నదో అని నా భయం" అన్నాడు ఎగతాళిగా నవ్వుతూ.

"డైరీలో ఇంకో రెండు మూడు నంబర్లున్నాయి... చేద్దామంటారా?" నేను మాట మారుస్తున్నట్లుగా అన్నాను.

ఒక్కక్షణం నిశ్శబ్దం తరువాత "నాకయితే అతడితో పరిచయం లేదుగాని – భార్యే రానన్నప్పుడు... అర్ధరాత్రప్పుడు ఈ శుభవార్తతో ఎవ్వరికి ఫోను చేసినా వాళ్ళకు మద్దెలదరువులాగానే వుంటుంది. పొద్దున చేద్దాం లేండి" నెమ్మదిగా అన్నాడు స్వెట్టర్ ఆయన.

"ఓకే"

మళ్ళీ కొద్ది క్షణాల నిశ్శబ్దం.... ఎవరైనా నాతో వస్తే బాగుండు... నాకు మరీ కొత్త ప్రదేశం... అంతా కొత్త మనుష్యులు... కాని రమ్మనమంటే మీదపడి పీకుతారేమోనని భయం మనస్సును పీకుతోంది.

చూద్దాం. "నేను వస్తాను మరి" అన్నాను.

"మమ్మల్ని ఎవరినైనా రమ్మనమంటారా?"

"వస్తే మంచిదే... నాకు ఏమీతోచడం లేదు.. ఇప్పుడు ఒంటిగంట దాటుతున్నది... నాలుగయిదు గంటలు ఆ శవజాగరణ చేసి ఆయనకు కావాల్సిన వాళ్ళెవరినైనా పిలిచి అప్పగిస్తే బాధ్యత తీరిపోతుందను కుంటాను" చిన్నగా అన్నాడు – ఆయన మాటలకు కొత్త ఊపిరి పీల్చు కుంటూ.

"ఏమిరా సన్నాసులూ! ఈ ముక్కలేసుకొని ఆ వరండాలోనే పడి వుంటే సరిపోతుందేమో... అటు శవానికి కాపలా వున్నట్లూ వుంటుంది. ఇటు మనకూ కాలక్షేపమూ అవుతుంది.... ఆపైన మాస్టారికి ధైర్యంగానూ వుంటుంది" అన్నాడు స్వెట్టర్ ఆయన.

"ఓకే... ఓకే!"

దీపాలు ఆరినయి. ఇంటికి తాళం పడింది. అంతమందిమీ గుంపుగా రామ్మూర్తి ఇంటి గేటు తీసుకుని వరండాలోకి వెళ్ళాం.

తలుపు పక్కగా తలవంచుకొని ఆ స్త్రీ కూర్చొని వున్నది.

"ఇదుగో పిల్లా! వరండాలో చాపేసి నాలుగ్లాసులతో నీళ్ళు పెట్టు.... అవునూ నువ్వు పక్కనుండగానే పోయాడా? శవాన్ని ముట్టుకుంటే మాత్రం నీళ్ళు తేబోకు... అదేదో మేం చూసుకుంటాం గాని ఓ చాప పడేయ్!" ఆరడు

## వేశ్య కొడుకు తలకొరివి పెడతాడు



బాధాకరమయిన సంఘటనను చూస్తే కథ రాస్తాను. 'చీకటి పువ్వు' అనే కథలో భార్యా భర్త ఉంటారు. భర్తకు అన్ని వ్యసనాలూ ఉంటాయి. దాంతో భార్య, భర్తను వదిలి వెళ్ళిపోతుంది. భర్త ఓ రాత్రి వేశ్యను ఇంటికి తీసుకొస్తాడు. ఆ రాత్రి హార్ట్ ఫెయిల్ అయి అతను చనిపోతాడు. వచ్చినామెకు ఏం చేయాలో తెలీదు. పొరుగింటి వారి సాయంతో అతని భార్యకు ఫోన్ చేస్తుంది. భర్త దహన సంస్కారానికి భార్య రాదు. దీంతో ఆ వేశ్య తన కొడుకు చేత అతనికి తలకొరివి పెట్టిస్తుంది. మానవత్వంపైన కథ ఇది. అందుకే నాకీ కథ నచ్చింది.

–పి.ఎస్.నారాయణ

**9948319407**

గుల పీలమనిషి అన్నాడు. అతడి కంఠంలో ఎగతాళి స్పష్టంగా కనిపిస్తున్నది. అతను కళ్ళార్పకుండా ఆమెనే చూస్తున్నాడు. "అవునూ నువ్వూ ఓ చేయి వేస్తా వేమిటి... నువ్వాడతానంటే మాత్రం లోపల కూర్చుందాం".

ఆమె అయోమయంగా అతడేమన్నాడో గూడా అర్థం గానట్లుగా వాళ్ళ వంక వెర్రి చూపులు చూస్తుంటే నా మనస్సు చివుక్కుమన్నది. ఆమె ఎన్ని కష్టాలు పడుతూ కక్కుర్తి పనికి ఒప్పుకున్నదో?

"నేను తెస్తానులేండి మంచినీళ్ళు.... మీరుండండి" నేను లోపలికి అడుగు వేశాను.

"ఇదుగో నిన్నే... ఏవూరు నీది?"

ఆమె మాట్లాడలేదు. గోడవైపు తల తిప్పుకు నిల్చున్నది.

"అంత సిగ్గుపడేదానివి రోజుకొకడితో ఎలాపోతావ్.... మేమూ మొగ వాళ్ళమేలే... కాస్త ఇటు తిరిగి అడిగిన దానికి సమాధానం చెప్పు!"

"అయినా నువ్వెందుకమ్మాయ్ ఇంకా ఇక్కడ... ఏ పోలీసులో వచ్చారంటే అదో గోల!"

"అర్ధరాత్రి పూట వంటరిగా ఎక్కడికి వెళుతుంది లేరా!"

"వాళ్ళకు రాత్రి భయాలుండవు లేవోయ్!" గాజు గ్లాసులు పగిలినట్లుగా ఘొల్లుమన్న నవ్వులు.

ఆమె చటుక్కున వాళ్ళ వైపుకు ఒక్కసారి చూసి రామ్మూర్తి శవం పక్కనే పడివున్న దుప్పటి తీసుకొని ఈ ప్రపంచాన్ని చూడలేనట్లుగా ఓ మూలకు పోయి ముసుగేసుకున్నట్లుగా కప్పుకొని ముడుచుకు కూర్చున్నది.

నాకు పరమ అసహ్యమేసింది వాళ్ళను చూస్తుంటే. వాళ్ళు పెద్ద మనుష్యులు. చచ్చిన రామ్మూర్తి లోకం దృష్టిలో పరమ దౌర్భాగ్యుడు. బ్రతికున్న వీళ్ళు ఈ సభ్య సమాజంలో భాగస్వాములు... పెళ్ళాలు వాళ్ళు చేసే వెధవ పనులను కాదనలేదు కాబట్టి ఛాతి విరుచుకొని రోడ్డు మీద తిరుగుతున్నారు.

వాళ్ళను తోడుగా పిలిచి నేను ఎంత తప్పుచేశానో నాకు ఆ క్షణాన అర్థమయింది. వాళ్ళు నాకు తోడు రాలేదు. శవానికి కాపలా కాయటానికి రాలేదు, ఆ అమ్మాయిని చూడటానికి వచ్చారు. ఆ అమ్మాయితో మాటలు కలపటానికి వచ్చారు. ఆ అమ్మాయిని ఏడిపించి ఆనందించటానికి వచ్చారు.



వాళ్ళను బయటకు గెంటి తలుపు లువేద్దామా అన్నంత కోపమొచ్చింది. ఫ్రిజ్‌లో నుంచి మంచి నీళ్ళసీసా తీస్తూ నాలోని కోపాన్ని నేను నిగ్రహించుకో ప్రయత్నిస్తున్నాను.

నేనేమైనా అని వాళ్ళను వెళ్ళమంటే "ఏం బాబూ! పిల్ల బాగున్నది గదా అని మమ్మల్ని వెళ్ళ గొడుతున్నావా?" అని అన్నా అనేటంత నీచస్థితికి దిగజారేటంతటి వాళ్ళే వాళ్ళు. "ఓకే... ఓకే... ఇవాల్టికి వదిలేయ్... పక్కన శవమున్నది గదా!" అని డోకొచ్చేలా మాట్లాడినా మాట్లాడవచ్చు.

## జెనీలియా ఉగాది కానుక....

టాలీవుడ్ నుంచి బాలీవుడ్‌కి వెళ్ళి అక్కడ బిజీ అయి, దక్షిణాదిలో తన అభిమానుల మీద శీతకన్ను వేసిన జెనీలియా వారికి త్వరలో కనువిందు చేయనుంది. జెనీలియా ఇక టాలీవుడ్‌కి రాదు అన్న పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టేసింది. రామ్‌చరణ్ తేజ పక్కన ఓ సినిమాలో నటించడానికి అంగీకరించగా, మరో టాప్ హీరో సరసన నటించడానికి చర్చలు జరుగుతున్నాయట! ఈ రెండు చిత్రాలను జెనీలియా తన అభిమానులకు ఉగాది కానుకగా ఇచ్చిందని పలువురు అంటున్నారు. ఈ రెండే కాకుండా మరికొన్ని చిత్రాలు కూడా అంగీకరించే అవకాశం ఉన్నట్లు జెనీలియా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్వయంగా అంగీకరించడం విశేషం!

బయట చాప వేశాను. ట్యూబ్‌లైట్ వేశాను. రెండు సీసాలతో చల్లటి నీళ్ళు పెట్టాను.

"మీరూ చేయి వేస్తారా మాస్టారూ?"

"నాకు చేతకాదండీ!"

"అయ్యొయ్యో! ఏం మనుషులండీ మీరు.. పేకాట చేతగాకుండా జీవితాన్ని ఎలా ఈదుకొస్తున్నారండీ బాబు!"

"పోనీలేండి... నా దురదృష్టం అనుకుంటాను!" చిన్నగా అన్నాను వాళ్ళ మాటలకు లోలోన అసహ్యించుకుంటూ. "పెద్దవారు మీరొక్కమాట చెప్పాలి" స్వెట్టర్ ఆయన వంక చూస్తూ అన్నాను. "శవం తలవైపు దీపం పెట్టమంటారా?"

"ఆс.... ఆс.... ఏమున్నా లేకపోయినా మీసాలకు సంపెంగ నూనె అన్నట్లు ఏలాంటి శవమైనా మన సంస్కృతీ సంప్రదాయాలను మట్టి గలపలేం కదా... ముందు ఆ మంచం మీద నుంచి క్రిందకు జేర్చండి. దీపం పెట్టండి. ప్రమిదలో ఇంత నూనెపోసి వత్తివేసి వెలిగించండి. చేతనయితే కాలివేళ్ళకు, చేతి వేళ్ళకు ఇంత గుడ్డ పీలిక తీసుకొని కట్టివేయండి".

నేను లోపలికి వచ్చేశాను. వెనక గదిలో దేవుడి ఫోటోలు వున్నాయి. అక్కడే కుందీ వత్తులు కూడా వున్నాయి. సీసాలో నూనె వున్నది. రెండు వత్తులు కలిపివేసి ఇంత నూనె పోసి దీపం వెలిగించాను.

శవాన్ని మంచం మీదనుంచి ఎత్తుతుంటే ఆమె లేచి సాయం పట్టింది నేను వద్దంటున్నా వినకుండా. "బయట వాళ్ళను పిలుద్దామని నాలిక చివరిదాకా వచ్చింది గాని – వాళ్ళ కారుకూతలు వినలేక వద్దన్నట్లుగా నోరు నొక్కేసుకున్నాను.

"ఆవిడ వస్తానన్నదా?" చిన్నగా లోతైన బావిలోనుంచి అన్నట్లుగా అన్నది. ఆమె కంఠం అవమానపు దుఃఖంతో తడిసి ముద్దయి వున్నది.

"రానన్నది!"

"ఏమిటట?"

"తనకు సంబంధం లేదన్నది!"

క్షణం భయంకరమైన నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలోకి ఆమె గుండెల్లో నుండి ఓ దీర్ఘనిశ్వాసం.

"పోనీలేండి... నాకో కొడుకున్నాడు... ఈయన వాడికి తండ్రి కాకపోయినా నేను కొరివి పెట్టమంటే పెట్టేస్తాడు!"

ఆమె చాలాచిన్నగా అన్నా ఆ మాటలు నా గుండెల్లో లోతుగా గుచ్చుకున్నాయి.

కుందిలో దీపం శవం తల దగ్గర వెలుగుతున్నది.

రెండు నిముషాలు ఏదో తెలియని మైకంలో ఆమె మాటల్నే మననం చేసుకుంటూ ఆ శవం తలపక్కన దీపం దగ్గర కూర్చుండిపోయాను.

"గుడ్డ పీలికలు దొరికితే బాగుండు... కాళ్ళకూ, చేతులకూ కట్టవచ్చు"

"నేను చూస్తానుండండి" ఆమె లేచింది.

నేను లేచి టేబుల్ మీద పెట్టిన అడ్రసులున్న డైరీని తీసుకొని మరోసారి తిరగవేయసాగాను. ఈ ఊళ్ళో ఈయనగారికి తెలిసిన వాళ్ళుగాని, బంధువులుగాని వుంటే బాగుండు... వాళ్ళు వస్తే నాకీ బాధ్యతలు తప్పుతాయి... అవమానాలు, అభాండాలు తప్పుతాయి.. మనఃక్లేశం తప్పుతుంది.

ఆ డైరీలోని ఓ పేజీలో నాకళ్ళు సూటిగా చూపుల్ని కేంద్రీకరించి కదలకుండా నిలిచిపోయాయి.

'ఉన్నతభావాలతో పెరిగిన నేను లంచగొండి నయ్యాను... మీద పడుతున్న కొత్త మనుష్యులతో త్రాగుబోతునయ్యాను... వ్యభిచారి నయ్యాను.

అన్నిటికీ మూలం?

ఇంకెవ్వరూ?

అందుకే–

ఎంతకీ ధనార్తి తీరని

ఆలికన్నా

పిడికెడు రూకలకు తృప్తిపడే

వెలయాలు మిన్న...'

*

(ఉదయం: వారపత్రిక 18.01.1991)